
# కథావేదిక

ప్రతినెలా వైవిధ్యంగల కథలను అందిస్తూ కథాప్రియులకు వెతుక్కునే పనిలేకుండా కథలన్నీ ఒకేచోట చేర్చి, కత్తిరించి పొందుపరచుకుంటే చక్కని కథల సంకలనంలా మారి, మంచి కథను మళ్లీ మళ్లీ చదువుకునే చక్కని అవకాశాన్ని పాఠకులకు కలిగించే వినూత్న ప్రక్రియ... ఈ కథావేదిక.

## కొత్తకోణం

- దేవగుప్తం అన్నపూర్ణ



హైదరాబాద్ ట్రైన్ దిగి రాఘవ ఇల్లు చేరేసరికి రాత్రి పదిగంటలౌతోంది. లోపల్నుంచి కొడుకు కోడలు మాటల్లో తన గురించిన ప్రస్తావన రావటంతో తలుపు తట్టబోతున్నవాడల్లా ఆగిపోయాడు.

''ఈయనకు తిని కూర్చుంటే తోచటం లేదు కాబోలు, ఆ పేపర్లు పత్రికలు చూసీ చూసీ..మొన్న చూశారా వాళ్ల స్నేహితుడి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చినప్పుడు ఎంత గొడవ చేశాడో...అసలు టిక్కెట్టుకే మనమీద ఆధారపడినవాడు ఆ పత్రికలకు ఫోటో ఎందుకు పంపించాలి? పంపించాడు సరే, దానికాయనెవరో ఉత్తరం రాయటం...ఈయన గిలగిల్లాడిపోయి పరిగెత్తటం...చూశారా?''

కోడలి మాటలకు కొడుకు అడ్డు చెప్పటంలేదు. చెప్పి గొడవ చేసుకొని, మనశ్శాంతి లేకుండా చేసుకొనే తెలివి తక్కువవాడు కాదు రాఘవ కొడుకు.

నిజమే. ఆ ఫోటో పత్రికకు పంపటం, అది పత్రికలో అచ్చు కావటం, తన అడ్రస్‌కు సారథి రిప్లై రావటం, తను డబ్బు సమకూర్చుకొని వెళ్లేసరికి వాడు మృత్యు రేఖ దాటేస్తూ వుండటం...అన్నీ గుర్తొచ్చి విపరీతమైన నీరసం వచ్చింది రాఘవకు.

''పోన్లేవోయ్, అమ్మ పోయినప్పట్నుంచీ మరీ ఒంటరితనంతో బాధ పడుతున్నాడు. దాంతోనే ఆయన ఆరోగ్యం పాడై ఉద్యోగం మానేశాడు. లేకపోతే...''

''ఆ లేకపోతే ఆ వచ్చే ముష్టి పదిహేనొందలుతోనే ఆయన జీవితం గడిచిపోయేదా?'' మధ్యలోనే అందుకొని గట్టిగా అంది కోడలు.

''ఎందుకు నీకసలాయనంటే కోపం? పాపం సంపాదించిన ప్రతి పైసా నాకే ఇచ్చాడు. రిటైర్మెంట్ బెనిఫిట్ కూడా...''

''ఆ ఇచ్చాడులే ముష్టి యాభైవేలు, ఆయన పోయే దాకా చూడాలిగా మరి!''

ఎందుకో కోడలికి తనంటే అంత విముఖత్వం?

''అమ్మా, తాతయ్యకు ఉత్తరం వచ్చిందే. లెటర్ బాక్స్‌లోనే వుంది. నే తర్వాత తీద్దామని మర్చిపోయా...'' నిద్ర గొంతుతో చెప్పింది కావ్య, రాఘవ మనవరాలు.

''సర్లే, మళ్లీ ఏ పనీపాటా లేనివాడో రాసి వుంటాడు ఆ పాత ఫోటో చూసుకుని! నువ్వింకా పడుకోలేదా, మళ్లీ రేపొద్దున్నే లేవనంటావు'' ఒక్క కసురు కసిరింది కూతురుని.

వెంటనే బయటకు నడిచి లెటర్ బాక్స్‌లోంచి ఉత్తరం తీసి, ప్రక్కనే వున్న స్ట్రీట్ లైట్ దగ్గరకెళ్లాడు రాఘవ.

ప్రియమైన రాఘవకు,

ఫ్రం రమణ అనుంది.

రమణ...రమణ అంటే? గుర్తుకు రావడంలేదు రాఘవకు.

## సాగరం

''సంసారం సాగరం' అని ఎందుకన్నారండీ'' అడిగింది భార్య సందేహంగా.

''అది తెలిస్తే ఈ సంసారంలోనికి నేను దిగేవాణ్ణే కాను'' దిగులుగా చెప్పాడు భర్త.

- ఎల్.పి. చంద్ర (ధర్మవరం)

## గరల్ ఫ్రెండ్

''నాకు ప్రమోషన్ వచ్చినందుకు సంతోషించాలి గానీ అలా దిగులుగా వున్నావేంటీ?'' అన్నాడు రాజా.

''మీ వేకెన్సీ ఎట్లా నింపాలా అని...'' అనేసి నాలు కర్చుకుంది గరల్ ఫ్రెండ్ రోజా.

- చెంగల కృష్ణమూర్తి (లింగన్నపాలెం)

## మెజీషియన్

''మీ నాన్న మెజీషియన్ అంటున్నావు! ఏం మేజిక్ చేస్తాడు?''

''రాత్రి పడుకునే ముందు నాపక్క ఉంటాడు. తెల్లారి చూస్తే మా అమ్మపక్కలో ఉంటాడు.''


- తిరుమలరాజు రఘువర్మ (దేవుపల్లి)

## నిజం

''ఇంతకు ముందు నన్ను రంభ, సౌందర్య, మాధురి, అనేవారు. ఇప్పుడు కనీసం ముచ్చటకైనా, అలా అనడంలేదేం.'' అంది భార్య రత్న.

''మొన్న నూతన సంవత్సరం నుంచి అబద్ధాలు ఆడటం మానేశాను.'' అన్నాడు భర్త.

- పి. శ్రీనువాసువర్మ (మరుపల్లి)




ఉత్తరం చదవటం మొదలెట్టాడు.

రాఘవకు,

మిమ్మల్ని ప్రియమైన రాఘవా అని సంబోధించేటంత చనువు మనిద్దరి మధ్యా లేదు. ఉండండి, కానీ ఉత్తరం రాయటానికి కారణం మీరు. నలభై సంవత్సరాల క్రితపు మన గ్రూప్ ఫోటో పత్రికకు పంపించటమే. అందులో అడ్రస్ చూసి, మీకు ఈ ఉత్తరం రాయాలనిపించింది. నేనెవరో మీకు గుర్తుండకపోవచ్చు. డిగ్రీలో మీ క్లాస్‌మేట్ శోభన్‌బాబు గుర్తున్నాడా?... అదేనండీ బాబు క్లాసులో అందరూ కలిసి నాకు పెట్టిన నిక్‌నేమ్.

ఆ! గుర్తొచ్చాడు. మంచి రంగు. పర్సనాలిటీ. ఉంగరాల జుట్టుతో హీరోలాగా వుండేవాడు. అతనే ఈ రమణ.

ఆ గుర్తొచ్చానా? ఇంతకీ డిగ్రీలో క్లాస్‌మేట్స్‌మి. గ్రూపులు వేరే కావటం వలన కామన్ క్లాసుల్లో కలిసేవాళ్లం. అందుకే పెద్ద క్లోజ్‌నెస్ లేదు మన మధ్య. అన్నట్లు మీ ఫ్రెండ్ సారధిగారు బాగున్నారా?

మనమందరం సింహాచలం వెళ్లినప్పుడు, అక్కడున్న ఓ స్థంభం పట్టుకుని మన మనసులో కోరిక కోరుకుంటే ఫలిస్తుందని నువ్వు, సారధి అనుకుంటుంటే విని, నేనూ మొక్కుకున్నా. ఏమనో తెలుసా...నేనెటూ ఫస్ట్ క్లాస్ స్టూడెంట్‌ను కాదు. వేరేవాళ్లమీద ఆధారపడకుండా నా జీవితం చివరి వరకు సాగించాలని.

అప్పటివరకు మనసులో లేని ఆలోచనలను ఆరోజు నుండే ఒక పద్ధతి ప్రకారం మలచుకున్నాను.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ కాగానే ఉద్యోగ ప్రయత్నాలు చేసీ చేసీ అలసిపోయి మా ఊరు వెళ్లాను. వెళ్లగానే మా నాన్న బలవంతంతో కట్నంతోపాటు పట్నంలో బట్టల షాపులో పార్టనర్‌షిప్ ఇచ్చే ప్రపోజల్‌తో పార్వతిని పెళ్లి చేసుకున్నా. పార్వతి కనుముక్కుతీరు చక్కగానే వున్న చక్కటి నల్లరాతి విగ్రహంలా వుండేది.

తనకున్న డబ్బుతో ఆ లోపాన్ని కప్పి పుచ్చుతూ నాకు లేని డబ్బు ఆధారంగా నన్ను పార్వతికి కొనిపెట్టాడామె తండ్రి. కానీ నల్లని రూపున్న పార్వతి మనసు మల్లెకన్నా తెల్లనిది కావటం నా అదృష్టమే!

మన చదువుకి...ఊహలకి...జీవితానికి పొంతన ఏమాత్రం వుండదని అర్థమై అడ్జెస్టైపోయా. కానీ బాధపడుతూ సర్దుకుపోవల్సిందే అన్నంత కష్టం నాకెప్పుడూ కలగలేదు.

కలిసొచ్చిన వ్యాపారం. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు.

అందరికీ పెళ్లిళ్లైపోయాయి. కొడుకులు, కోడళ్లు ఉద్యోగస్థులే.

అమ్మాయికి ఫారిన్ సంబంధం చేశాను.

బాధ్యతలు తీరిపోయాక వుండటం అనవసరం అనుకుందేమో, జీవితాంతం నీకు తోడుంటా అంటూ నన్నంటి పెట్టుకున్న పార్వతి ఆమాట వమ్ముచేస్తూ నన్ను ఒంటరివాణ్ణి చేసి భగవంతుణ్ణి చేరి రెండేళ్లవుతోంది.

అప్పటివరకు వున్న ఉద్యోగం హుష్‌కాకీ అంటూ ఎగిరిపోయింది. పార్వతి పోయిన డిప్రషన్ వల్లనే!

క్రమక్రమంగా నా ఆరోగ్యం పాడౌతోంది. షాప్ సరిగ్గా చూసుకోలేకపోతున్నా. అంతా అమ్మేసేద్దామనుకుంటున్నా.

నా అనారోగ్యంతో ఇప్పుడిప్పుడే కోడళ్ల నుండి విసుర్లు మొదలౌతున్నాయి.

పత్రికలో పడ్డ ఆ పాత ఫోటో అడ్రస్ చూసి, ఒక్కసారి పాత రోజులు, కమ్మని కలలు కనే కాలేజీ రోజులు ఆ హుషారు, తీయదనం, ధైర్యం అన్నీ గుర్తొచ్చి మన మధ్య పెద్ద చనువు లేకపోయినా మీరేమనుకుంటారో అనైనా ఆలోచించకుండా ఇంత పెద్ద ఉత్తరం రాసినందుకు క్షమించండి.

అప్పటి మనమధ్య వున్న దూరం వల్ల అక్కడక్కడా మీరు అనీ, ఆ జ్ఞాపకాల ఆర్ద్రత వల్ల కొన్నిచోట్ల నువ్వు అనీ రాశాను. అర్థం చేసుకుంటారుగా!

ప్రస్తుతం నా ఆరోగ్య, ఆర్థిక సమస్యల వల్ల నిన్ను చూడాలని ఎంతగానో వున్నా రాలేకపోతున్నా. నువ్వు వీలు చేసుకొని వస్తే నాకంతకన్నా 'ఆనందించే రోజు' ప్రస్తుతానికి వుండదు.

నీకోసం ఎదురుచూస్తాను.

ప్రేమతో,

మీకప్పుడు కాకపోయినా, ఇప్పుడు ఆప్తమిత్రుడవ్వాలనుకుంటున్న

రమణ

అదేంటి ఇంత పాత డేట్ వుంది. దగ్గర దగ్గర నెలరోజుల క్రితం రాసిన ఉత్తరం. పోస్టల్ డిలేనో, పోస్ట్ చేయటంలో డిలేనో.

సారధి గురించిన దిగులు ఈ ఉత్తరంలో కొంచెం శాంతించింది.

ఆ ఉత్తరంలోని ఏదో తెలీని దగ్గరతనంతో, ఆర్తితో నన్ను తన దగ్గరకి లాక్కుంటున్నాడు రమణ.

కన్నీటితో మసకబారుతున్న కళ్లను తుడుచుకుంటూ ఒక్క నిమిషం ఆలోచించాడు రాఘవ.

అందరికీ ఒకేలాంటి అనుభవాలా?

తనిప్పుడు ఇంటికెళ్తే సంతోషించేవాళ్లు లేకపోగా బాధపడేవాళ్లు ఎక్కువ.

ఒక్కసారి రమణ దగ్గరకు వెళ్తే నష్టమేంటి?

జేబులో చూసుకున్నాడు రాఘవ. ఫరవాలేదు. టిక్కెట్టుకు డబ్బులున్నాయి. స్టేషన్ వేపు నడిచాడు రాఘవ.

• • •

రమణ ఇచ్చిన అడ్రస్ ప్రకారం అక్కడికి చేరేసరికి ఉదయం ఆరున్నర ఐంది. ఇల్లు పెద్దదే. రెండతస్థుల మేడ. క్రింద రెండు, పైన రెండు వాటాలుగా వుంది. ముందున్న ఖాళీ స్థలంలో ఏవో పూలమొక్కలు.

క్రింద రెండు వాటాల్లో ఏ తలుపు తట్టాలా అని ఆలోచిస్తుంటే బయట నుంచి ''హలో, ఎవరండీ మీరు?'' సన్నగా వినిపించిన ఆడపిల్ల గొంతు విని వెనక్కి తిరిగాడు రాఘవ.

లూనా స్టాండ్ వేసి, పుస్తకాల బ్యాగ్‌తో వస్తోందో పదహారేళ్లమ్మాయి.

''రమణ వున్నాడా అమ్మా...'' అడిగాడు రాఘవ.

''ఓ! తాతయ్య గురించా, రండి...మీరు రాఘవ గారా?'' అడిగిందామ్మాయి.

''ఔనమ్మా, వున్నాడా మీ తాతయ్య?''

ఉన్నారుగానీ ప్రస్తుతానికి ఇంట్లో కాదు. మీరు వస్తే తీసుకురమ్మన్నారు. లూనా మీద కూర్చోగలరా?'' అడిగిందామ్మాయి.

''ఎక్కడికెళ్లాలి?''

''హోంకి...''

''అంటే...?''

''చూద్దురుగాని పదండి...'' రయ్యిన నడుపుతూ పది నిమిషాల్లో ఓ భవనం ముందు ఆపింది.

''వృద్ధాశ్రమం...'' బోర్డు చూసి ఒక్కక్షణం అచేతనుడయ్యాడు రాఘవ. అంటే అందరూ వుండి, అంత ఆస్తి సంపాదించి, చివరికి రమణ..ఇక్కడా?

మనసులో ముల్లు గుచ్చుకున్న భావన.

నిజంగా వృద్ధాప్యం ఎంత శాపం? అనుకుంటూ లోపలికి నడిచాడు రాఘవ.

లోపల మెడిటేషన్ క్లాస్ జరుగుతోంది.

ఇద్దరూ బయటే కూర్చున్నారు.

''చూడండి తాతగారూ, మేమింతమందిమి వుండగా తాతయ్య ఇక్కడుంటానని పట్టుబట్టారు. ఇంట్లో అంతా ఈ విషయం గురించి ఎంత బాధపడుతున్నామో తెల్సా?'' అని వాచ్ చూసుకొని, ''అరే! మళ్లీ కాలేజీకి టైమైపోతుంది. నేవెళ్లొస్తాను..తాతయ్యకు మీరు నచ్చ చెప్పరూ, ప్లీజ్' అంటూ వెళ్లిపోయింది.

''రాఘవా! నువ్వు..నువ్వేనా? నా ఉత్తరం చూసి వచ్చావా?'' సంభ్రమంగా అడుగుతూ వచ్చి రాఘవ చేతులు పట్టుకున్నాడు రమణ.

రాఘవ కళ్లు చమర్చాయి.

కష్టసుఖాలు మాట్లాడుకున్న తర్వాత విషయంలోకి వచ్చాడు రాఘవ.

''అదేంటి రమణా, అంత ఆస్తి, స్వంత ఇంటినీ, స్వంత మనుషులనూ వదిలేసి ఇక్కడుండటమేంటి? మీవాళ్లంతా బాధపడుతున్నారుట?''

''అదంతేలే రాఘవా! మనింట్లో ఏదన్నా వస్తువున్నదనుకో, వాడకంలో వున్నన్నిరోజులూ వాడతాము. అదే మూలపడిందనుకో, అదెంత ఇష్టమైనదైనా మనకు ఇంట్లో అడ్డుగా అనవసరంగానే అనిపిస్తుంది...''

''అంటే మనుషులూ, వస్తువులూ ఒక్కటేనా? మనం కని, పెంచి ప్రయోజకుల్ని చేసేదెందుకు? వృద్ధాప్యంలో మనల్ని ఆదరిస్తారనే కదా?'' ఆవేశంగా అడిగాడు రాఘవ.


''అదిగో! అక్కడే వుంది మన లోపం. కని, పెంచి పెద్దచేయడం అనేది మన బాధ్యత మాత్రమే. అంతేగానీ అది మన పెట్టుబడి అనీ...దానికి ప్రతిఫలం రావాలనీ అనుకోవటమే మన తప్పు. పిల్లలు మాత్రమే మన జీవితమనీ, మనకున్నదంతా మనముండగానే వాళ్లకిచ్చెయ్యాలనీ అనుకోవటం కూడా తప్పే. అవన్నీ మన జీవితంలో ఒక్కో భాగం. అందులో మన భాగం మనకెప్పుడూ వుండాలి. ఒకప్పటి సంగతేమోగానీ ప్రస్తుత సమాజపు స్పీడ్ జీవితానికి సెంటిమెంట్స్‌తో ముడిపెడితే అనవసరపు అశాంతి, బాధ తప్ప ఏమీ మిగలవు. నువ్వున్నట్లు నా కొడుకులు కోడళ్ల దగ్గర నేనుండవచ్చు. కానీ...ఇద్దరిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నవాళ్లు. హడావుడి జీవితాల్లో మనం వాళ్లకు బర్డెన్‌గానే ఔతాము. కాగా అలసి సొలసి వచ్చినవాళ్లకు మనతో తీరిగ్గా మాట్లాడే ఓపిక, తీరికా వుండవు. వాళ్లని తప్పు పడుతూ, ఒంటరితనం ఫీలౌతూ బాధ పడే బదులుగా, ఇక్కడ మన సమవయస్కులతో హాయిగా, తీరిగ్గా మన ఓపిక, మన టైం మనచేతిలో వుంచుకొని కాలక్షేపం చెయ్యవచ్చనిపించింది. ఉన్న ఆస్తి నాలుగు భాగాలు చేసి పిల్లలు ముగ్గురికీ మూడు భాగాలిచ్చేశాను. నాలుగో భాగం నాపేరునే ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఆ వడ్డీ ఈ హోంకే ఇచ్చేస్తున్నాను నెల నెలా. ఇంక ఒంట్లో ఓపిక వుంది కనుక హోం కవసరమైన ఎకౌంట్స్ లాంటివి చూస్తూ టీవీ, యోగాల్లాంటి వాటితో, తోటివారి కష్టసుఖాలు వింటూ ఓదారుస్తూ ఇలాంటి మానసిక తృప్తినిచ్చే కార్యక్రమాలలో కాలక్షేపం చేస్తూ హాయిగా వున్నా దీనావస్థలో వున్నవారికి ఉచితంగా సేవచేస్తూ. ఈ సంస్థకే నా తదనంతరం నావాటా చెందేలా రాశాను...'' రమణ చెప్పుకుంటూ పోతున్నాడు.

నిజమే! రిటైరవ్వగానే జీవితమైపోయినట్లు, చిన్న చిన్న అనారోగ్యాలకే పెద్ద రోగాలొచ్చి మూలపడిపోయినట్లు కాకుండా మన ఓపికున్నంతవరకు ఎవరిమీదైనా ఆధారపడకుండా జీవితాన్ని గడపగల్గితే ఎంత తృప్తి? తను మాత్రం మూలపడిన వస్తువులా ఎందుకుండాలి? తనకంటూ పైసా లేకపోవచ్చు. కానీ ఒంట్లో కాస్తో కూస్తో శక్తి వుంది. రమణ లాంటివాళ్ల ప్రోత్సాహం ఎటూ వుంటుంది. తనూ ఈ హోంలోనే వుండి చేతనైన పని చేయాలని ఆ క్షణంలోనే నిశ్చయించుకున్నాడు రాఘవ.

జీవితాన్ని 'కొత్త కోణం'లోంచి చూడటంతో కొత్తజీవితంలోకి అడుగు పెట్టినట్లనిపించింది రాఘవకు.

★

## మెగాస్టార్ మెగాకారు



భోగాలు, భాగ్యాలు అనుభవించాలంటే స్టార్స్ కావాలని అనుకుంటారు. మెగాస్టార్ చిరంజీవి కారు విషయం తీసుకుంటే అందులో ఎన్నో సౌకర్యాలు వుంటాయి. ఈ ఏ.సి. కారులో నలుగురు కూర్చొని మాట్లాడుకునే విధంగా కాన్ఫరెన్స్ క్యాబిన్ కూడా వుంటుంది. దాన్ని మార్చుకుంటే డైనింగ్ క్యాబిన్‌గా మారిపోతుంది. లోపల బాత్‌రూం సౌకర్యం, రిలాక్స్ కావడానికి, డిస్కషన్స్‌కి ఇలా మరెన్నో సౌకర్యాలు వున్నాయి. ఎంతయినా స్టార్ కదా!

## రవళి నగల పిచ్చి

సాధారణంగా హీరోయిన్స్ నగల మీద అంత మోజు చూపించరు. షూటింగ్స్‌లో రకరకాల నగలు ధరించి విసిగిపోయి నిజ జీవితంలో సాదాసీదాగా వుంటారు. కాని రవళికి బంగారు నగలంటే ఎంతిష్టమో! పాపిట బిల్ల, ముత్యాల బొట్టు, ముక్కుపుడక, చెవులకు లోలాకులు, రత్నాల హారం, గాజులు, ఉంగరాలు ఇలా ఎన్నో స్వంతంగా చేయించుకున్న నగలు పెట్టుకొని షూటింగ్స్ లేనప్పుడు కూడా రవళి మెరిసిపోతూ కనిపిస్తుంది.

- యస్. శివానంద్

